# వేటపాలెం ప్రాంత కమ్యూనిస్టు అమరుల సంస్మరణ సభ

**వేటపాలెం, 12-5-16 :**

ప్రకాశంజిల్లా-వేటపాలెం ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలు, తొలితరం కమ్యూనిస్టులైన కా॥కస్తూరి కుటుంబరావు, సజ్జా సూర్యబాలానందం, బండారు వెంకటేశ్వర్లులతో పాటుగా, చేనేత, పీడిత ప్రజాఉద్యమాలలో తమ తుదిశ్వాస విడిచే వరకూ కృషిసాగించిన కమ్యూనిస్టు అమరులు కా॥పింజల వెంకటసుబ్బారావు, కా॥యారాసు సుబ్రహ్మణ్యం, కా॥మంచా శ్రీరాములుల సంస్మరణలో భాగంగా సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో మే 12న సభను నిర్వహించారు. ఈ సభలో పెద్దసంఖ్యలో కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు, వివిధ వర్గాల ప్రజలు, చేనేత కార్మికులూ పాల్గొన్నారు.




అమరుల సంస్మరణసభలో ప్రసంగిస్తున్న కా॥ వై. సోని

సిపిఐ(ఎం-ఎల్) నాయకుడు కా॥నాయని కుటుంబరావు అధ్యక్షత వహించిన ఈ బహిరంగసభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥వై. సోని మాట్లాడుతూ, విదేశీ, స్వదేశీ బహుళజాతి కార్పొరేటు శక్తుల సేవలో పునీతమౌతున్న కేంద్ర, రాష్ట్ర పాలకులూ, ప్రభుత్వాలూ ప్రజల రక్తమాంసాలను పీల్చిపిప్పి చేస్తున్నాయని, రైతాంగాన్ని భూమి నుంచి నిరాశ్రయులను చేస్తున్నాయని, లక్షల సంఖ్యలో చిన్న, మధ్యతరగతి, కుటీర పరిశ్రమలను మూసివేసి తీవ్రమైన ఉపాధిలేమిని, నిరుద్యోగాన్ని సృష్టిస్తూ వున్నాయని, మార్కెట్ మాయాజూదంలో ప్రజలందరినీ బలిపశువుల్ని చేస్తూ ఉన్నాయని, కార్మికులు తమరక్తం చిందించి, వెలలేని త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ కాలరాస్తున్నాయని, యజమానులకు అనుకూలంగా చట్టాలను సవరిస్తున్నారని, సెజ్‌లు, కారిడార్‌ల పేర దేశంలో బ్రాండిక్స్‌వంటి కంపెనీలకు కష్టజీవులను బలిపెడుతున్నారని ఈ విధానాలను నిరసిస్తూ బెంగుళూరు, విశాఖ తదితర ప్రాంతాల కార్మికవర్గ పోరాటాలకు దేశవ్యాపిత కార్మికవర్గం తమ సంఘీభావం తెలపాలని అన్నారు.

సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకురాలు కా॥ఎస్. లలితకుమారి మాట్లాడుతూ వేటపాలెం ప్రాంతానికి అనాది నుంచి కమ్యూనిస్టు వారసత్వం, పోరాటాల, త్యాగాల వారసత్వం వుందనీ, ఎందరో కమ్యూనిస్టు నాయకులు పీడిత ప్రజాఉద్యమ నిర్మాణానికి అంకితమయ్యారని, ప్రజలను కూడగట్టారని, ప్రత్యేకించి చేనేత రంగంలో రెక్కాడితేగాని డొక్కాడని చేనేత కూలి సోదరులను ఏకంచేసి వృత్తిరక్షణకు, జీవనం మెరుగుదల కోసం, బీడి కార్మికుల వేతనాలకోసం, జీడిపప్పు కార్మికుల, ఇసుక రైతుల సమస్యలపై, రొంపేరు బంజరు పోరాటంలో నిలబడి కలబడి పోరాడారని వారి ఆశయాలను అందుకుని వారు చూపిన పోరుబాటలో ఎర్రజెండా వెలుగులో సమస్త దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం అంకితమవడమే అమరులకు అసలైన నివాళి అని అన్నారు.

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం(ఆం.ప్ర) జిల్లా కన్వీనర్ కా॥వార్తికోట సుబ్బారావు మాట్లాడుతూ అమరుడు కా॥కస్తూరి చూపిన బాటలో కా॥పింజల తదితర అమరులు చేనేత కార్మికులను ఆర్థిక పోరాటాల స్థాయినుండి ప్రజాతంత్ర ఉద్యమస్థాయికి తీసుకు పోవడంకోసం గత 40 ఏళ్ళుగా ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘంగా కృషి సాగించారని వృత్తిరక్షణ పోరాటాలకు, వేతన పెంపుదలకు, పాలకుల చేనేత వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేతన్నలను కూడగట్టి వారిని వర్గస్పృహతో ఉద్యమబాట పట్టించారని, ఈ నేపథ్యంలో వారిని మరింత సంఘటితశక్తిగా మలచడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు.

కార్యక్రమంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కా॥ సతీష్, జె.పి.భూషణం బాబు తదితరులు మాట్లాడారు.

oooooo